




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
డిసెంబర్ 06 ,2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## ప్రతి వస్తువు వెనుక ఓ అర్థం!

### పుతిన్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక కానుకలు...

- రష్యన్ భాషలో భగవద్గీత, అస్సాం టీ, కశ్మీరీ కుంకుమపువ్వు బహూకరణ
- మహారాష్ట్ర వెండి గుర్రం, ముర్షిదాబాద్ వెండి టీ సెట్, ఆగ్రా మార్బుల్ చదరంగం
- భారతీయ సంస్కృతి, వారసత్వం, హస్తకళల గొప్పతనాన్ని చాటిన బహుమతులు

భారత పర్యటనకు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ప్రత్యేకమైన బహుమతులను అందజేశారు. ఇవి కేవలం వస్తువులు కావు, భారతీయ సంస్కృతి, వారసత్వం, హస్తకళల గొప్పతనానికి అద్దం పట్టే ప్రతీకలు. 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా పుతిన్‌కు ఈ కానుకలను అందించారు. ప్రతి బహుమతిని ఎంతో ఆలోచించి, ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహబంధాన్ని ప్రతిబింబించేలా ఎంపిక చేయడం విశేషం.

- మిగతా 2వ పేజీలో



## సంక్రాంతికి డీకేకు శుభవార్త!


డీసీఎంతో సిద్ధు వర్గంలోని కీలక నేత సతీశ్ ప్రత్యేక చర్చలు

ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే మంతనాలు

## వంద సార్లయినా ఢిల్లీ వెళ్లి నిధులడుగుతా..

- రెఫరెండం అన్నోడిని బండకేసి కొట్టారు.. సిగ్గు లేకుండా నెల రోజులకే తిరుగుతుండు
- గడీలోళ్ల కరెంటు పీకేందుకే కాంగ్రెస్ వచ్చింది.. ఉచిత కరెంట్ పేటెంట్ హక్కులు కాంగ్రెసవే
- మంత్రితో పని చేయించుకొనే వాళ్లను ఎన్నుకోండి.. త్వరలో 40 వేల ఉద్యోగాల ప్రకటన
- మార్చిలో 35 లక్షల ఇందిరమ్మ చీరల పంపిణీ.. నర్సంపేట బహిరంగ సభలో సీఎం రేవంత్

వరంగల: రాష్ట్ర ప్రజలు అండగా ఉంటే ఢిల్లీనైనా ఢీకొట్టడానికి వెనుకాడనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ఒకటికి వంద సార్లు ఢిల్లీకి వెళ్లి అడుగుతానని, ముఖ్యమంత్రిగా ప్రధాని దగ్గరకు, కేంద్ర మంత్రుల దగ్గరకు వెళ్లడం తన బాధ్యతని చెప్పారు. తనకు ఓపిక, వయసు, విషయాన్ని వివరించే పరిజ్ఞానం ఉన్నాయని ప్రస్తావించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తానని, అదే సమయంలో రాకపోతే ఎంత దూరం అయినా వెళ్లి కొట్లాడతానని అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ.532 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి




## ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లలోని టీచర్లే బెస్ట్

- ప్రభుత్వ బడుల్లో 18 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని వెల్లడి
- విదేశీ విద్య కోసం 'కలలకు రెక్కలు' పథకం కింద పావలా వడ్డీకే రుణాలు
- మూడేళ్లలో ఏపీ విద్యారంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని హామీ

- మిగతా 2వ పేజీలో






## మన దేశంలో హిందువులకే అవమానాలు



- తిరుప్పరన్‌కుండ్రంలో కార్తీక దీపం వెలిగించడంలో అడ్డంకులు
- కోర్టులో గెలిచినా ఆచారాన్ని కోల్పోయామన్న పవన్
- హిందువులను చులకనగా చూస్తున్నారన్న ఆవేదన
- ఆలయాల నిర్వహణకు సనాతన ధర్మ రక్షా బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్
- కులం, ప్రాంతం పేరుతో విడిపోతే హిందూ ధర్మానికి నష్టమని వెల్లడి

భారతదేశంలో హిందువులు తమ మత విశ్వాసాలను ఆచరించేందుకు న్యాయపోరాటాలు చేయాల్సి రావడం విచారకరమని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులోని తిరుప్పరన్‌కుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే విషయంలో కోర్టు అనుమతి ఉన్నప్పటికీ, అధికారులు అడ్డుకోవడంపై ఆయన స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల వ్యవహారాలను భక్తులే పర్యవేక్షించేలా "సనాతన ధర్మ రక్షా బోర్డు"ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "తిరుప్పరన్‌కుండ్రం, ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలలో మొదటిది. అక్కడ కార్తీక మాసంలో కొండపై దీపాలు వెలిగించడం హిందువుల ప్రాచీన సంప్రదాయం. ఈ రోజు భారతదేశంలో హిందువులు తమ విశ్వాసాలను ఆచరించడానికి, సంప్రదాయాలను పాటించడానికి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి రావడం బాధాకరం, విచారకరం. ఒక నిర్ణయాత్మకమైన న్యాయపోరాటంలో గెలిచిన తర్వాత కూడా, భక్తులు తమ

- మిగతా 2వ పేజీలో

## హిడ్మా హత్యకు ఆ నలుగురే కారణం

మావోయిస్టు అగ్రనేత హిడ్మా మృతిపై ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) సంచలన విషయాలు వెల్లడించింది. కమిటీ కార్యదర్శి వికల్ప్ పేరుతో విడుదల చేసిన ఓ లేఖలో, హిడ్మాది ఎన్‌కౌంటర్ కాదని, అది పక్కా ప్రణాళికతో చేసిన హత్యేనని ఆరోపించింది. హిడ్మా ఆచూకీని దేవ్ జీ పోలీసులకు చెప్పారన్న వార్తలను పార్టీ తీవ్రంగా ఖండించింది. “దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి మాతోనే ఉన్నారు. వారు లొంగిపోయేందుకు ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు. హిడ్మా సమాచారాన్ని దేవ్ జీ పోలీసులకు చెప్పారనేది పూర్తిగా అవాస్తవం” అని లేఖలో స్పష్టం చేశారు. హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులు కారణమని, వారిలో అడవి నుంచి బయటకు వచ్చిన కోసాల్ అనే వ్యక్తి ప్రధాన సూత్రధారి అని పేర్కొన్నారు. అతనితో పాటు విజయవాడకు చెందిన ఓ కలప వ్యాపారి, ఫర్నిచర్ వ్యాపారి, మరో కాంట్రాక్టర్ ఉన్నారని ఆరోపించారు. చికిత్స నిమిత్తం అక్టోబర్ 27న హిడ్మా సదరు కలప వ్యాపారి ద్వారా విజయవాడకు వెళ్లాడని, ఈ సమాచారం పోలీసులకు చేరడంతోనే హిడ్మాతో సహా 13 మందిని పట్టుకుని హత్య చేశారని మావోయిస్టు పార్టీ తెలిపింది. ఈ హత్యలను కప్పిపుచ్చుకునేందుకే మారేడుమిల్లి, రంపచోడవరం ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్ జరిగినట్టు కట్టుకథ అల్లారని ఆరోపించింది. ఇది కేవలం ఏపీ పోలీసుల ఆపరేషన్ కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్ అని లేఖలో పేర్కొంది. వారి ఆశయాలను ముందుకు తీసుకెళతామని శపథం చేస్తున్నట్లు మావోయిస్టు పార్టీ స్పష్టం చేసింది.

# వంద సార్లయినా ఢిల్లీ వెళ్లి నిధులడుగుతా..

శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణపై కేంద్ర వివక్ష చూపుతోందని, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిదుల్ని ఇవ్వడం లేదని ఆరోపించారు. బీఆర్ఎసకు రెండు సార్లు అధికారం ఇస్తే సొంత ఆస్తులు సంపాదించుకున్నరని, ఫామ్‌హౌసలు కట్టుకొని, విమానాలు కొనుక్కున్నరని, టీవీ చానళ్లు, పత్రికలు పెట్టుకున్నరని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం మారలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని, ఒక్క గింజ కొనేది లేదు దిక్కున్న చోట చెప్పుకొండని అన్నారని రేవంత్ ప్రస్తావించారు. తమ ప్రభుత్వం చివరి గింజ వరకు కొంటోందని చెప్పారు. సన్న వడ్లు పండిస్తే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నిలబెట్టుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు బంద్ అవుతుందని, రుణమాఫీ అబద్దమని, కరెంట్ ఉండదని తప్పుడు ప్రచారం చేశారన్నారు. తెలంగాణను దోచుకున్నోళ్లకే కరెంట్ పోయిందని, గడీలోళ్ల కరెంటు పీకేందుకే కాంగ్రెస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. దుక్కిదున్నే రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదని, 2004లో దేశంలోనే రైతాంగానికి ఉచిత విద్యుత్‌పై రాజశేఖర్‌రెడ్డి తొలి సంతకం చేశారని ప్రస్తావించారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌కు రెండింతల ధాన్యం పండిస్తున్నట్లు గుర్తు చేశారు. 1.10 కోట్ల రేషన్ కార్డుల మీద 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని ప్రకటించారు. ఏడాదికి రూ.11 వేల కోట్ల భారం అవుతున్నప్పటికీ పేదలకు సన్నబియ్యం ఇవ్వాల్సిందేనని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిందని, ధనిక రాష్ట్రం సీఎంగా కేసీఆర్ ఎన్ని ఇళ్లు కట్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని 65 లక్షల మంది ఆడపడుచులకు చీరలను కానుకగా ఇస్తున్నామని చెప్పారు. ప్రతీ ఆడపడుచుకు చీరె అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు చొరవ తీసుకోవాలని కోరారు. మార్చి నెలలో పట్టణ ప్రాంతాల్లో ఉండే 35 లక్షల మంది మహిళలకు చీరెలను అందిస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను రెఫరెండంగా ప్రకటించి, ప్రచారం చేసిన కేటీఆర్‌ను ఓటర్లు బండకేసి కొట్టారని సీఎం అన్నారు. సిగ్గు లేకుండా కనీసం నెల కూడా కాకుండానే మళ్లీ తిరుగుతూ అబద్దాల ప్రచారం చేస్తున్నాడని దుయ్యబట్టారు. నాలుగు సార్లు ఎన్నికల్లో ప్రజలు పండబెట్టి వీపు మీద గుద్ది చెప్పినా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు పంచాయతీ ఎన్నికల మీద దృష్టి పెట్టొద్దని ముఖ్యమంత్రి కోరారు. చదువు ఒక్కటే మీ జీవితాన్ని, తలరాతను మార్చుతుందని చెప్పారు. నాణ్యమైన విద్యను అందించి, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, లాయర్లుగా, ఐపీఎస్, ఐఏఎసలుగా తీర్చిదిద్దే బాధ్యత తనదని అన్నారు. గొల్లోళ్లు గొర్రెలు పెంచుకోవాలే, బెస్తోళ్లు చేపలు పట్టుకోవాలే, ఎస్సీలు చెప్పులు కుట్టుకోవాలె అన్నట్లుగా కేసీఆర్ పథకాలు తెచ్చిండని, ఆయన పిల్లలు రాజ్యం ఏలాలంటే మీ పిల్లలు గొర్లు, చేపలు పెంచుకోవాలన్నది ఆయన ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వం భూములు ఇస్తుందనో, ఆస్తులు పంచుతుందనో ఆశలు పెట్టుకోవద్దని, 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని, వాటికి కష్టపడండని చెప్పారు.

## మధ్య తరగతికీ ఇళ్లు.. వచ్చే మార్చి నాటికి లక్ష

హైదరాబాద్: రాష్ట్రంలోని మధ్య తరగతి ప్రజల కోసం చవకగా ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. లాభనష్టాల యోచనకు అతీతంగా ప్రభుత్వం దీన్ని చేపట్టనుందన్నారు. ఇందుకోసం అఫర్డబుల్ (సరసమైన) హౌసింగ్ పాలసీని రూపొందించనున్నట్టు వెల్లడించారు. ఈ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఔటర్ రింగు రోడ్డుకు నాలుగు వైపులా నాలుగు స్థలాలను గుర్తించామని, ఒక్కోచోట 8 వేల నుంచి 10 వేల వరకు ఇళ్లను నిర్మిస్తామని ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో గృహనిర్మాణ శాఖ రెండేళ్ల ప్రగతిపై ఆయన విలేకరులతో మాట్లాడారు. లీజులు చెల్లించని భూముల స్వాధీనం: ‘గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని కేపీహెచ్‌బీలో నిర్మించిన హౌసింగ్ బోర్డు ఇళ్లల్లో శిథిలావస్థకు చేరుకున్నవాటిని గుర్తించి వాటిని తొలగించి ఆయా స్థలాల్లో హైరైజ్ భవనాల నిర్మాణానికి అనుమతించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 2 బీహెచ్‌కే ఇళ్లను రూ.700 కోట్లు వెచ్చించి పూర్తి చేస్తున్నాం. మరో రూ.200 కోట్లతో ఆయా కాలనీలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. లీజులు చెల్లించని, కబ్జా అయిన హౌసింగ్ బోర్డు భూములను స్వాధీనం చేసుకుంటున్నాం. ఇప్పటికే వెయ్యి ఎకరాల భూమికి ప్రహరీ గోడలు నిర్మించాం. ఇప్పటివరకు 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, 3 లక్షల ఇళ్లు వివిధ స్థాయిల్లో నిర్మాణంలో ఉన్నాయి. వచ్చే మార్చి నాటికి లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. జూన్ నాటికి మరో 2 లక్షల ఇళ్ల గృహ ప్రవేశాలుంటాయి.

# ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లల్లోని టీచర్లే బెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన “మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-3.0” కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, రాష్ట్ర విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, “గత ప్రభుత్వం ఉపాధ్యాయులను అవమానించింది, మద్యం షాపుల వద్ద డ్యూటీలు వేసింది. కానీ మా ప్రభుత్వం టీచర్లకు గౌరవం ఇస్తుంది. మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయులను నియమించాం. పారదర్శకంగా బదిలీలు చేపట్టాం. టీచర్లను గౌరవించే బాధ్యత మాది, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది,” అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని అందరూ కోరుకునే పరిస్థితిని తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని విద్యార్థులు ఉన్నత, విదేశీ విద్యకు దూరమవ్వకూడదనే లక్ష్యంతో ‘కలలకు రెక్కలు’ అనే సరికొత్త పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కింద విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు అయ్యే ఖర్చు మొత్తాన్ని పావలా వడ్డీకే రుణంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు తమ ఆశయాలను చంపుకోవాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానానికి దేశంలోనే ప్రథమ స్థానం దక్కేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, విద్యాశాఖను సమర్థంగా నిర్వహిస్తున్నారంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను చంద్రబాబు అభినందించారు.



### ఆవిష్కరణలకు పెద్దపీట.. ఇన్నోవేటర్స్ సమ్మిట్

విద్యార్థుల్లో సృజనాత్మకతను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వచ్చే ఏడాది జనవరిలో “స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్” నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ఏడో తరగతి నుంచే విద్యార్థులను వినూత్నంగా ఆలోచించేలా తీర్చిదిద్దుతామని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వారి ప్రతిభను గుర్తించి పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యే అవకాశం కల్పిస్తామని చెప్పారు. భామిని మోడల్ స్కూల్‌లోని ల్యాబ్స్‌ను పరిశీలించిన ఆయన, ‘క్లిక్కర్ టూల్’ ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసే విధానాన్ని ప్రశంసించారు. ‘స్కై, మౌంటెన్, స్ట్రీమ్’గా విద్యార్థులను వర్గీకరించి, వారి బలాబలాలకు అనుగుణంగా బోధన చేయడం మంచి ఫలితాలనిస్తుందన్నారు. చదువుతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగానే చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం కోసం ‘డొక్కా సీతమ్మ’ పథకాన్ని, రాజకీయ రంగులు లేని స్టూడెంట్ కిట్లను అందిస్తున్నామని గుర్తుచేశారు. శనివారం ‘నో బ్యాగ్ డే’ వంటి కార్యక్రమాలతో విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకునే వాతావరణం కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఎం, మంత్రి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

# మన దేశంలో హిందువులకే అవమానాలు

(మొదటి పేజీ తరువాయి)ం

సొంత ఆస్తిపై ఒక చిన్న, శాంతియుతమైన ఆచారాన్ని కూడా పాటించలేకపోతే, ఇక ఈ దేశంలో వారికి రాజ్యాంగబద్ధమైన న్యాయం ఎక్కడ లభిస్తుంది? భారతదేశంలోని హిందువులందరూ ఒక కఠోర నిజాన్ని అర్థం చేసుకోవాలి. దీపం వెలిగించే హక్కు మనకే ఉందని చెన్నై హైకోర్టు మొదట సింగిల్ జడ్జి ద్వారా, ఆ తర్వాత ఉన్నత ధర్మాసనం ద్వారా ధృవీకరించింది. చట్టపరంగా మనం గెలిచాం. కానీ ఆచరణలో మాత్రం సర్దుకుపోవాల్సి వచ్చింది. మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. ఏ మతపరమైన పండుగనైనా ఒక వారం ఆలస్యంగా జరుపుకోగలరా? ఒక పవిత్రమైన రోజు వేడుకను వేరే సమయానికి మార్చగలరా? లేదు. ఎందుకంటే మతపరమైన సమయం, క్యాలెండర్ల పవిత్రత చర్చించలేనివి. అయినా సనాతన ధర్మానికి సంబంధించిన ఆ పవిత్రమైన కార్తీక దీపపు క్షణం దొంగిలించబడింది. అది శాశ్వతంగా మాయమైపోయింది. ఎందుకంటే హిందువులను చులకనగా తీసుకుంటున్నారు. ప్రభుత్వాలు, అధికారులు, ఎన్జీవోలు, మేధావులమని చెప్పుకునే బృందాలు.. ఇలా ఎవరైనా సరే, నష్టాన్ని అంగీకరించి సర్దుకుపోయేది మాత్రం ప్రతిసారీ హిందువులే. మనం హక్కును సాధించుకున్నాం, కానీ ఆచారాన్ని కోల్పోయాం. ఈ పునరావృత, వ్యవస్థాగత తిరస్కరణ కారణంగా, కేవలం కోర్టు విజయాలు మాత్రమే కాకుండా అంతకుమించి డిమాండ్ చేయాల్సిన సమయం వచ్చింది. భక్తులే తమ దేవాలయాలు, మతపరమైన వ్యవహారాలను చురుకుగా నిర్వహించే ‘సనాతన ధర్మ రక్షా బోర్డు’ మనకు అవసరం. హిందువులకు ఆర్టికల్ 25 ప్రాథమిక హక్కు కాకుండా, ఐచ్ఛిక హక్కుగా మారిందా? ఒక పోలీస్ కమిషనర్ లేదా జిల్లా మేజిస్ట్రేట్ నిర్దిష్ట హైకోర్టు ఆదేశాలను ఏకపక్షంగా రద్దు చేయగలరా? చట్టబద్ధమైన భూమిలో దీపం వెలిగించడం ‘హానిచేయని మతపరమైన చర్య’ అని హైకోర్టు నిర్ధారించినప్పుడు, ఈ ఆచారం మత సామరస్యానికి ముప్పు అని ఎవరు, ఏ చట్టపరమైన యంత్రాంగం ద్వారా నిర్ణయిస్తారు? హిందూ మత సంస్థల శాఖ (%ఎ=ఊజజు%) అధికారులు నిలకడగా హిందూ భక్తుల ప్రయోజనాలకు, ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? వారెలా జవాబుదారీతనం నుంచి తప్పించుకుంటున్నారు? మతపరమైన సమస్యలు తలెత్తినప్పుడు అబ్రహామిక్ మతాలను (అరేబియా మూలాలున్న మతాలు) అనుసరించేవారిలో ఉన్న ఐక్యతా స్ఫూర్తిని, సంఘీభావాన్ని హిందువులు గమనించాలి. వారు తమ విశ్వాసం కోసం జాతి, ప్రాంతీయ, భాషా భేదాలను అధిగమిస్తారు. హిందువులు కులం, ప్రాంతం, భాషా అడ్డంకులతో విడిపోయి ఉన్నంత కాలం, హిందూ మతం, దాని ఆచారాలపై అపహాస్యాలు, అవమానాలు కొనసాగుతూనే ఉంటాయి. మన దేశంలోని హిందువులు హిందూ ధర్మం (తమిళంలో ఆరం) స్ఫూర్తితో ఒక ఉమ్మడి కనీస కార్యక్రమం కింద ఏకం కాకపోతే, ఈ స్ఫూర్తి నశించిపోతుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కామాఖ్య నుంచి ద్వారక వరకు ఉన్న ప్రతి హిందువు తమ సొంత గడ్డపై హిందువులు ఎదుర్కొంటున్న అవమానాలపై మేల్కొనే రోజు వస్తుందని నేను ఆశిస్తున్నాను’.

## ఇండిగో తెచ్చిన సంక్షోభం

దేశీ పౌరవిమానయాన రంగంలో 66 శాతం వాటాతో దాదాపు గుత్తాధిపత్యం చెలాయిస్తున్న ఇండిగో సంస్థ... తమ జోలికెవరూ రాకూడదన్న రీతిలో వ్యవహరించిన తీరు వల్ల శుక్రవారం వెయ్యికి పైగా విమానాలు రద్దయ్యాయి. ఈ సంఖ్య మరింత ఎక్కువ ఉండవచ్చు కానీ.. నిర్దిష్టంగా ఎంతన్నది సంస్థ వెల్లడించలేదు. బుధ, గురు వారాల్లోనూ వెయ్యికి పైగా విమానాలు రద్దు కావటంతో దేశవ్యాప్తంగా ప్రయాణికుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పైలట్ల డ్యూటీ, విశ్రాంతికి సంబంధించి పౌరవిమానయాన సంస్థ (డీజీసీఏ) ఇచ్చిన మార్గదర్శకాలను పాటించడం ఇష్టంలేక... విమానాలు రద్దుచేసి ప్రయాణికుల్ని ఇబ్బందులు పెట్టడం ద్వారా డీజీసీఏను దిగివచ్చేలా చేయాలన్న ఇండిగో వ్యూహం నెరవేరినట్లే అనుకోవాలి. వేల విమానాలు రద్దవుతుండటంతో చివరకు డీజీసీఏ దిగివచ్చింది. నిబంధనలను తాత్కాలికంగా సడలిస్తామని, విమానాలు పూర్తిస్థాయిలో తిరిగేలా చేయాలని ఇండిగోను అభ్యర్థించింది. ఇండిగో దీనికి ఒప్పుకుంటూనే... తాము మార్గదర్శకాలను లైట్ తీసుకున్నామని, అందుకే ఈ పరిస్థితి వచ్చిందని, డీజీసీఏ సడలింపులిచ్చింది కనక త్వరలో పరిస్థితి చక్కబడుతుందని అధికారికంగా ప్రకటించింది. ఏ రంగంలోనైనా ఒకటిరెండు సంస్థలే గుత్తాధిపత్యం చెలాయిస్తే ఏమవుతుందన్నది ఇండిగో ఉదంతం మరోసారి నిరూపించినట్లయింది. పైలట్లు విరామంలేకుండా విమానాలను వేల కిలోమీటర్ల దూరాలు నడుపుతున్నారని, దీనివల్ల వారి ఆరోగ్యంతో పాటు ప్రయాణికులు సైతం రిస్కులో పడుతున్నారని భావించి డీజీసీఏ కొన్ని నిబంధనలు తీసుకొచ్చింది. వీటిని 2024 జనవరిలోనే విడుదల చేసింది. మొత్తం 22 నిబంధనల్లో 15 నిబంధనలు ఈ ఏడాది జూలై నుంచి అమల్లోకి రాగా... పైలట్ల విశ్రాంతి, డ్యూటీకి సంబంధించిన మిగతా 7 నిబంధనలు ఈ నవంబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వారానికి 12 గంటలుగా ఉన్న పైలట్ల విశ్రాంతి సమయాన్ని 48 గంటలకు పెంచడం, రాత్రి వేళ ఏ పైలట్ కూడా రెండుకు మించి ఎక్కువ ల్యాండింగ్‌లు చేయకూడదని విధించిన నిబంధనలను పాటించటం వల్ల మరింతమంది సిబ్బంది కావాల్సి వస్తారని ఇండిగో భావించింది. అందుకే ఈ నిబంధనల్ని అడ్డం పెట్టుకుని నవంబరులో ఏకంగా 1,200పైగా విమానాలను రద్దు చేసింది.

# సంక్రాంతికి డీకేకు శుభవార్త!

బెంగళూరు: వచ్చే ఏడాది జనవరిలో సంక్రాంతి నాటికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు శుభవార్త అందనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో ఇంకా ఆయా నేతలతో వరుస సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి మంత్రి సతీశ్ జార్కిహొళితో డీకే శివకుమార్ ప్రత్యేకంగా చర్చించారు. సిద్ధరామయ్య వర్గంలో ప్రధాన నాయకుడిగా గుర్తింపు పొందిన సతీశ్ జార్కిహొళి ఒక ప్రైవేటు కార్యక్రమంలో డీకే శివకుమార్‌తో ప్రత్యేకంగా చర్చలు జరపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే కూడా డీకే ఇంటికి వెళ్లి మాట్లాడారు. తద్వారా సిద్ధరామయ్య వర్గాన్ని తన వైపునకు తిప్పుకునే ప్రయత్నాలను డీకే వేగవంతం చేశారని తెలుస్తోంది. ఈ పరిణామాలు త్వరలో డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి దాదాపు ఖాయమని చెబుతున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ సమావేశాలు, వచ్చే వారం అసెంబ్లీ సమావేశాలు, ఇంకా అనేక అంశాల వల్ల ముఖ్యమంత్రి మార్పు వాయిదా పడిందని, జనవరిలో అన్నింటికీ శుభం కార్డు పడనుందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. కాగా సీఎం, డీసీఎం రెండు బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌ల ద్వారా ఇరు వర్గాలకు చెందిన నేతల బహిరంగ వ్యాఖ్యలు దాదాపు తగ్గిపోయాయి. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండడంతో అందరూ కలసికట్టుగా సాగాలని హైకమాండ్ స్పష్టమైన సందేశం ఇచ్చింది.

కర్ణాటక కాంగ్రెస్ పార్టీ రాజకీయ వైకుంఠపాళిలో మరో పెద్ద టర్నింగ్ పాయింట్ చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

# ప్రతి వస్తువు వెనుక ఓ అర్థం!

ఈ కానుకల్లో అత్యంత ముఖ్యమైనది రష్యన్ భాషలోకి అనువదించిన “శ్రీమద్ భగవద్గీత”. శ్రీకృష్ణుడి బోధనల సారాంశమైన గీత, నైతిక జీవనం, మానసిక నియంత్రణ, అంతర్గత శాంతికి మార్గం చూపుతుంది. తన మిత్రుడైన పుతిన్ సులభంగా చదివి, అర్థం చేసుకునేందుకే మోదీ ప్రత్యేకంగా రష్యన్ అనువాదాన్ని బహూకరించారు. దీనితో పాటు, జీఐ ట్యాగ్ పొందిన ప్రసిద్ధ అస్సాం బ్లాక్ టీని కూడా అందించారు. అసామికా మొక్క ఆకుల నుంచి సంప్రదాయ పద్ధతిలో తయారయ్యే ఈ టీ, ప్రత్యేకమైన రుచికి, ఆరోగ్య ప్రయోజనాలకు పెట్టింది పేరు. పశ్చిమ బెంగాల్ కళా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచే ముర్షిదాబాద్ వెండి టీ సెట్‌ను కూడా పుతిన్‌కు బహూకరించారు. దీనిపై ఉన్న సూక్ష్మమైన నగిషీలు ఆకట్టుకుంటాయి. భారత్, రష్యా సమాజాల్లో టీకి ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను ఇది తెలియజేస్తుంది. ఈ వెండి టీ సెట్ ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహానికి, ఆప్యాయతకు చిహ్నంగా నిలుస్తుంది. మహారాష్ట్రకు చెందిన చేతితో తయారుచేసిన వెండి గుర్రం మరో ప్రత్యేక ఆకర్షణ. ఇది భారత లోహ హస్తకళా నైపుణ్యానికి నిదర్శనం. ముందుకు దూకుతున్న భంగిమలో ఉన్న ఈ గుర్రం, కాలపరీక్షకు నిలిచి నిరంతరం పురోగమిస్తున్న భారత్-రష్యా భాగస్వామ్యానికి ప్రతీక. అంతేకాకుండా, ఇరు దేశాల సంస్కృతులలో గౌరవించే ధైర్యం, పరాక్రమానికి కూడా ఇది చిహ్నం. “ఒక జిల్లా-ఒక ఉత్పత్తి” పథకంలో భాగంగా ఆగ్రాకు చెందిన చేతితో రూపొందించిన పాలరాతి చదరంగం సెట్‌ను బహుమతుల్లో చేర్చారు. ఉత్తర భారత కళా నైపుణ్యాన్ని చాటిచెప్పే ఈ చదరంగం బోర్డు, పావులు అందరినీ ఆకట్టుకుంటాయి. పాలరాయి, చెక్క, విలువైన రాళ్లతో చేసిన ఈ సెట్, వ్యూహాత్మక మేధస్సుకు ప్రతీకగా నిలుస్తుంది. వీటన్నింటితో పాటు, కశ్మీర్ పర్వత ప్రాంతాల్లో పండే ప్రఖ్యాత కుంకుమపువ్వును కూడా అందజేశారు. ‘రెడ్ గోల్డ్’గా పిలువబడే ఈ సుగంధ ద్రవ్యం గొప్ప రుచి, రంగు, సువాసనకు ప్రసిద్ధి. జీఐ ట్యాగ్ పొందిన ఈ కుంకుమపువ్వు స్థానిక రైతుల ఆర్థిక విలువతో పాటు, ప్రకృతి, సంప్రదాయం, హస్తకళల సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తుంది. మొత్తంగా ఈ కానుకలన్నీ భారతీయ వైవిధ్యాన్ని, ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల మైత్రిని చాటిచెప్పాయి.

# ఓటమి గెలుపుకు పునాది ఆల్ ఇండియా టీచర్స్ ఫెడరేషన్ కార్యదర్శి చాలా రవి.....

**పిల్లలు ఆట, పాటలు, శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి....**

**ప్రశ్నించడం నేర్చుకుంటేనే కొత్త విషయం తెలుసుకుంటారు....**

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బాలోత్సవ సభ.....**






శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఓటమి గెలుపుకు పునాది అని ఆల్ ఇండియా టీచర్స్ ఫెడరేషన్ కార్యదర్శి చాలా రవి అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు వివిధ ప్రభుత్వ ప్రవేట్ స్కూల్లో ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చుట్టుపక్కల స్కూల్ విద్యార్థుల తో రెండు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు సైన్స్ రంగంలో వివిధ అంశాలపై నిర్వహించిన వ్యాసరచన ఉపన్యాస పోటీ తదితర అంశాలపై విద్యార్థులు పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అంత చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. విద్యార్థులు నిరంతరం తమ చదువులో పరిసర ప్రాంతాలలో కొత్త విషయాలపై అవగాహన పెంచుకోవాలని అవగాహన పెంచుకున్నప్పుడే మరింత ముందుకు వెళ్తారని ఆయన తెలిపారు. అబ్దుల్ కలాం భగత్ సింగ్ సుందరయ్య లాంటి ఎంతోమంది ఈ దేశ బాలల భవిష్యత్తు కోసం శ్రమించి అనేక కలలు కన్నారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ షేర్ లింగంపల్లి ఎం ఈ ఓ వెంకటయ్య, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ప్రభాకర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు సభ్యులు సాంబశివరావు , ప్రజా సంఘాల నాయకులు శోభన్, కృష్ణ విజ్ఞాన కేంద్రం సిబ్బంది అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

# 'క్లెయిమ్' ప్రక్రియను సజావుగా, వేగంగా చేయడమే మా లక్ష్యం....

**పాలసీబజార్ జాయింట్ గ్రూప్ సీఈఓ సర్బవీర్ సింగ.....**

**ఘనంగా 'ఇన్సూరెన్స్ కా సూపర్ హీరో' వేడుక...**





శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : 'క్లెయిమ్' ప్రక్రియను సజావుగా, వేగంగా చేయడం తమ లక్ష్యమని పాలసీబజార్ జాయింట్ గ్రూప్ సీఈఓ సర్బవీర్ సింగ్ తెలిపారు. హైదరాబాద్‌లో పాలసీబజార్ 'ఇన్సూరెన్స్ కా సూపర్ హీరో' నాలుగో ఎడిషన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాలసీబజార్ కస్టమర్లు, నాన్-కస్టమర్లు ఇద్దరూ తిరస్కరణకు గురైన, నిలిచిపోయిన క్లెయిమ్‌లను పాలసీబజార్ సహాయంతో మంజూరు చేయించుకున్న ఆశాజనక అనుభవాలు పంచుకున్నారు.ఈ కథలన్నీ పాలసీబజార్ 'సూపర్ హీరోలు' అచంచలమైన పట్టుదల, నిబద్ధతతో పాటు మా ఇన్సూరర్ భాగస్వాముల సహకారంతో సాధ్యంచేశారు. వీరందరినీ 'ఇన్సూరెన్స్ కా సూపర్ హీరో' అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ కష్టపడి సంపాదించిన డబ్బును ప్రీమియంగా చెల్లిస్తారన్నారు. అవసరానికి అందుతాయని ఆశిస్తారన్నారు. సాంకేతిక సమస్యల్లో చిక్కుకు పోవడాన్ని హర్షించరన్నారు. ప్రతి క్లెయిమ్ మా దృష్టిలో ఒక కుటుంబం దురదృష్టకర పరిస్థితిని, ఆసుపత్రి చేరికను, పెరుగుతున్న వైద్య ఖర్చులను సూచిస్తాయన్నారు. ఆ భారాన్ని తగ్గించడమే ఆరోగ్య బీమా ఉద్దేశమన్నారు. క్లెయిమ్ సమాధాన్ దివస్ వంటి కార్యక్రమాలు, ఫీల్డ్‌లో పని చేసే ప్రత్యేక క్లెయిమ్ సహాయక బృందాల ద్వారా వేల సంఖ్యలో నిలిచిపోయిన కేసులను మళ్లీ తెరవడం, కోట్ల రూపాయల విలువైన క్లెయిమ్‌లను విజయవంతంగా ప్రాసెస్ చేయడం వంటి కీలక సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యలు వినియోగదారుల నమ్మకాన్ని మరింతగా పెంచిందన్నారు. క్లెయిమ్ ప్రాసెసింగ్‌లో ఉన్న ప్రమాణాలు మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని చెప్పారు. ఏ క్లెయిమ్ అన్యాయంగా తిరస్కరించబడకుండా లేదా నిలిచిపోకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా కస్టమర్ మురళి తన అనుభవాన్ని పంచుకున్నారు. 'నా తండ్రికి స్టేజ్%-%4 క్యాన్సర్ ఉంది, 30కి పైగా హాస్పిటలైజేషన్లు జరిగాయి. మొదట మా క్లెయిమ్ తిరస్కరించబడింది. వెంటనే పాలసీబజార్ రంగంలోకి దిగింది. అవసరమైన పత్రాలు సేకరించింది. ప్రతి దానిని ఆమోదం పొందేలా చూసింది. పాలసీలోని అన్లిమిటెడ్ రిస్టోరేషన్ వల్ల రూ.1.2 కోట్లకు పైగా ఖర్చైన చికిత్సలో అందులో 25 ఖరీదైన ఇమ్యూనోథెరపీ సెషన్లు కూడా పూర్తిగా కవరయ్యేలా చూసింది' అని తెలిపారు.ఈ సందర్భంగా మరొక కస్టమర్ మారెళ్ల శ్రీనివాసరావు తన అనుభవాన్ని పంచుకున్నారు. నాకు అక్యూట్ ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ వచ్చింది. అకస్మాత్తుగా ఎవల్యూషన్, సర్జరీ కోసం దాదాపు ఆరు లక్షలు అవసరం అయింది. రాత్రి సమయంలో ఆలస్యంగా పాలసీబజార్‌కు సమాచారం ఇచ్చినా వాళ్ల బృందం వెంటనే స్పందించింది. ఇన్సూరర్‌తో సమన్వయం చేస్తూ నాకు మార్గనిర్దేశం చేసింది. నిరంతర ఫాలోఅప్స్‌తో ప్రాథమిక, తుది క్లెయిమ్‌లు రెండూ త్వరగా ఆమోదం పొందాయి. ఆ అత్యవసర సమయంలో సజావుగా డిశ్చార్జ్ అయ్యేలా చూశారు' అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాలసీ బజార్ ఫిన్‌టెక్ అధ్యక్షుడు రాజీవ్ గుప్తా మాట్లాడుతూ పాలసీబజార్‌లో మా విజయం ఎన్ని పాలసీలు విక్రయించామన్న సంఖ్యతో కాదని, అవసర సమయంలో ఎంత మంది పక్కన నిలబడ్డామన్నదే కొలమానమని పేర్కొన్నారు. ఎందుకంటే, ఈ రంగంలో ఒకే ఒక్క ప్రశ్న ముఖ్యమైందన్నారు. ఎవరైనా సహాయం కోసం చేతులు చాపినప్పుడు మనం నిజంగా వారి వద్దకు వెళ్లామా? అన్నది ముఖ్యమన్నారు. ఈరోజు ఈ కార్యక్రమంలో ఉన్న ప్రతి కథా ఆ ప్రశ్నకు సమాధానం 'అవును' అని చెప్పిందన్నారు.ఈ సందర్భంగా పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ రెన్యూవల్స్ హెడ్ జితిన్ జైన్ మాట్లాడుతూ బీమాలో పెట్టుబడి పెట్టడానికి ప్రధాన కారణం క్లెయిమ్ కోసమేనన్నారు. సానుకూలమైన క్లెయిమ్ కథలు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఆరోగ్య బీమాను తీసుకోవడానికి ప్రేరేపిస్తాయన్నారు. కస్టమర్ ప్రయాణంలో ప్రతి దశలోనూ పూర్తి స్థాయి బాధ్యత తీసుకుంటామన్నారు. ఏ క్లెయిమ్ అయిన అన్యాయంగా తిరస్కరించబడకుండా, నిలిచిపోకుండా చూసుకుంటామన్నారు. ఈ పరిస్థితుల్లో మానవీయ స్పర్శ ఎంత ముఖ్యమో తెలుసన్నారు. అందుకే పాలసీదారులకు అవసరం ఉన్నప్పుడల్లా మా బృందాలు ప్రత్యక్షంగా సహాయం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా పాలసీబజార్ డైరెక్టర్ సజ్జా ప్రవీణ్ చౌదరి మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు వినియోగదారులకు బీమా వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచుతాయన్నారు. హైదరాబాద్‌లో ఆరోగ్య బీమా రెన్యూవల్ రేటు 80 శాతానికి పైగా ఉందన్నారు. ఇది దేశంలోనే అత్యధికమన్నారు. హైదరాబాద్‌లో 71 శాతం పాలసీదారులు ఐదు లక్షల కంటే ఎక్కువ బీమా మొత్తాన్ని కలిగి ఉన్నారన్నారు. ఇది దేశవ్యాప్తంగా 55 శాతంగా ఉందన్నారు. ఈ అవగాహన కుటుంబాలను అనుకోని పరిస్థితుల నుంచి రక్షిస్తాయన్నారు. ఆర్థిక ప్రణాళికలో ముందు చూపును ఇది సూచిస్తుందన్నారు. పాలసీదారుల ప్రయాణంలో అండగా నిలవడం, వారి విశ్వాసాన్ని నిలబెట్టడం మా అత్యంత ముఖ్యమైన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమర్లు, నాన్ కస్టమర్లు తిరస్కరణకు గురైన, వివాదాస్పద క్లెయిమ్‌లను ఆమోదింపజేయడంలో పాలసీబజార్ ఎలా సహాయపడిందో తెలిపారు. ఇవన్నీ పాలసీబజార్ సూపర్ హీరోల ధైర్యం, పట్టుదల, అంకితభావాన్ని ప్రతిబింబించాయి.

# కరికులం లో ఉద్యోగావకాశాలకు ప్రాధాన్యం.....

**హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకిష్టా రెడ్డి.....**


**గ్లోబల్ టీపీఓ మరియు హెచ్ఆర్ లీడర్షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025....**







మాదాపూర్ వార్త మిర్రర్ : కరికులం లో ఉద్యోగావకాశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకిష్టా రెడ్డి తెలిపారు. తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్‌తో కలిసి గ్లోబల్ టీపీఓ మరియు హెచ్ఆర్ లీడర్షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025ను మాధాపూర్‌లోని టీ-హబ్లో నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు ఉండాలి, ఎలాంటి జాబ్ ఓరియెంటెడ్ ఆపర్చునిటీస్ క్రియేట్ అవుతున్నాయన్న దానిపై ఈ వర్క్‌షాప్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న 235 కళాశాలలు ఇక్కడకు వచ్చాయన్నారు. ప్రత్యేకంగా జాబ్ అవుట్ కమ్ ఓరియెంటెడ్ కోర్సులు క్రియేట్ చేస్తున్నామన్నారు. కంపెనీల సీఈఓలు, హెచ్‌ఆర్లు ఇక్కడ ఉన్నారన్నారు. వీళ్ల అవసరాలను బేస్ చేసుకొని మన కరికులాన్ని తయారు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పుడు పోటీ పక్క వాడితో కాదని.. ప్రపంచంతో పోటీ పడాలని పేర్కొన్నారు. అందుకు పాఠ్యాంశాలలో సమూలంగా మార్పులు చేశామన్నారు. 'రైజింగ్ తెలంగాణ 2047'లో విద్య ఎంతో ముఖ్యమన్నారు. అన్ని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో పాఠ్యాంశాలను మార్చామన్నారుఆంగ్ల భాషలో ప్రావీణ్యం ఉండాలన్నారు. ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జయరాం మాట్లాడుతూ ఇది ఒక అద్భుతమైన వేదిక అన్నారు. ఇక్కడకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, అకాడమీ, కార్పొరేట్ ప్రతినిధులు విచ్చేశారన్నారు. ఇండస్ట్రీ, అకాడమీ నుంచి వచ్చిన ప్రతి ఒక్కరూ ఇక్కడ ఉన్నారన్నారు. ఈ రెండు రోజులలో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని సత్కరించనున్నామని చెప్పారు. ఈ సమ్మిట్ విద్యార్థులకు లాభదాయకమైన ఫలితాలను తీసుకురాబోతుందని పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ అంతర్జాతీయ సదస్సు నేడు శనివారం తో ముగియనుంది. ఈ సమ్మిట్‌లో దేశ నలుమూలల నుంచి వచ్చిన 24 రాష్ట్రాల ట్రైనింగ్ మరియు ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ ఛాప్టర్లు, హెచ్ఆర్ నాయకులు, పాలసీ మేకర్లు, అకాడమిషియన్లు ఒకే వేదికపై సమావేశం అయ్యారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్, హ్యూమన్ రిసోర్స్ అభివృద్ధి రంగాల్లో సంభాషణ, సహకారం, వినూత్నతకు ఇది ఒక విశేషమైన వేదిక అయింది. ఈ సమ్మిట్లో జాతీయ, అంతర్జాతీయ హెచ్ఆర్ నాయకుల కీలక ప్రసంగాలు, ప్యానల్ చర్చలు, టీపీఓలు, హెచ్ఆర్ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులకు ప్రత్యేక నెట్‌వర్కింగ్ అవకాశాలు, 24 రాష్ట్ర ఛాప్టర్ల మధ్య సహకార కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, ఇండస్ట్రీ, అకాడమియా భాగస్వామ్యాల బలోపేతంపై దృష్టి సారించారు. ఈ సమ్మిట్ భారతదేశంలో ప్రతిభ అభివృద్ధి, ప్లేస్‌మెంట్ వ్యూహాలకు కొత్త దిశను చూపుతుంది. విద్య, ఉపాధి రంగాల్లో ఇన్నోవేషన్, లీడర్షిప్‌కు కేంద్రంగా హైదరాబాద్ స్థాయిని మరింత బలోపేతం చేస్తుంది.

# నామినేషన్ ల ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 05యాదాద్రి భువనగిరి జిల్లా లో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఫేజ్-3 లో భాగంగా చౌటుప్పల్ మండలం పంతంగి క్లస్టర్ పరిధిలో నామినేషన్ ల ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్ నామినేషన్ లు దాఖలు చేయడానికి ఈరోజు చివరి రోజు కావడంతో ఎక్కువ మంది నామినేషన్ వేయడానికి వచ్చి లైన్ లో ఉన్నారు కాబట్టి చాలా జాగ్రత నామినేషన్ లు స్వీకరించాలి అన్నారు.సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ చేయడానికి వచ్చిన లైన్ లో నిలబడి ఉన్నారు.వారు అందరికీ లాస్ట్ నుండి ఫస్ట్ కి నెంబర్ ల వారీగా టోకెన్ లు ఇచ్చి ఎంత సమయం అయినా చివరి అభ్యర్థి వరకు నామినేషన్ లు తీసుకోవాలి అన్నారు. పోలీస్ వారు కూడా 5 గంటల తర్వాత గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ బారికేడ్లు పెట్టి లోనికి ఎవరు రాకుండా బందోబస్తు చేయాలి అన్నారు.

## ముదిగొండ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా ముంత విజయలక్ష్మి



దేవరకొండ డిసెంబర్ 05 వార్త మిర్రర్ :దేవరకొండ మండలం ముదిగొండ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముంత విజయలక్ష్మి (మల్లేష్) నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం సర్పంచ్ అభ్యర్థి ముంత విజయలక్ష్మి మాట్లాడుతూ దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ఆదేశాల మేరకు తాను సర్పంచ్ అభ్యర్థిగా గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నామినేషన్ దాఖలు చేశానని ఆమె తెలిపారు . రాష్ట్రంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల కోసం పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని ఆమె తెలిపారు. అంతేకాకుండా గ్రామ ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలుస్తానని ఆమె అన్నారు. అంతేకాకుండా ముదిగొండ గ్రామంలో పూర్తిస్థాయిలో సిసి రోడ్ల నిర్మాణం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ ఎంపీటీసీ లు జీవన్ రెడ్డి, చెన్నయ్య చారి, మాజీ సర్పంచ్ సత్యం మేకల వెంకటయ్య ముడిగ కొండయ్య చందగల వీరయ్య గణేష్ గురువయ్య పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## శ్రీహన్నీ వైన్స్ పర్మనెంట్ రూమును తొలగించాలి: బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వర్షిత్ రెడ్డి డిమాండ్


దేవరకొండ డిసెంబర్ 05 వార్త మిర్రర్ :దేవరకొండ పట్టణంలోని శ్రీహన్నీ వైన్స్ పక్కన పర్మినెంట్ రూమును తొలగించాలని కాలనీ మహిళలు గత మూడు రోజులుగా నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు డాక్టర్ వర్షిత్ రెడ్డిని కాలనీ వాసులు కలిసి వినతి పత్రం అందజేయడంతో ఆయన స్వయంగా శ్రీహన్నీ వైన్స్ పర్మనెంట్ రూమును పరిసరాలను సందర్శించి మహిళలతో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ సముదాయాల వద్ద ఓపెన్ జిమ్ము, దేవాలయాలు ,ఫంక్షన్ హాల్స్, గృహ సముదాయాల నడుమ పర్మెంటు రూమును తొలగించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు తొలగించని ఎడల వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి జగతయ్య పట్టణ బిజెపి అధ్యక్షుడు వస్కుల సుధాకర్, నక్క వెంకటేష్ యాదవ్, గుండాల అంజయ్య,జల్ద భాస్కర్ , నీల సుమన్, తదితరులు అన్నారు.

## యువ నాయకత్వంతో 6వ వార్డు అభివృద్ధి వినోద్ కుమార్ ఎల్వర్తి ప్రచార ఘోష



వార్త మిర్రర్ శంకరపల్లి డిసెంబర్ 05

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 6వ వార్డు నుంచి పోటీ చేస్తున్న యువ నాయకుడు వినోద్ కుమార్ ఎల్వర్తి గ్రామంలో చురుకైన ప్రచారం నిర్వహిస్తున్నారు. కొత్త ఆలోచనలు, పారదర్శక పాలనతో వార్డును అభివృద్ధి పథంలో నడిపించగలననే బలమైన ఆత్మవిశ్వాసాన్ని ఆయన ఓటర్ల ముందు ప్రదర్శిస్తున్నారు.వినోద్ కుమార్ ఎల్వర్తి ప్రచారంలో భాగంగా ఓటర్లను ఉద్దేశించి చేసిన ప్రధానమైన మంచిమాటలు నాకు అధికారం ఇవ్వండి, నేను మీకు అభివృద్ధిని తిరిగి ఇస్తాను. కేవలం మాటలు కాదు, చేతల్లో మార్పు చూపించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ప్రభుత్వ నిధుల వినియోగంలో, పథకాల అమలులో పూర్తి పారదర్శకత పాటిస్తాను. వార్డు అభివృద్ధికి సంబంధించిన ప్రతి పైసా లెక్క ప్రజలకు అందుబాటులో ఉంచుతాను. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రతి నిర్ణయం తీసుకుంటాం.""తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం నా మొదటి లక్ష్యం. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఆధునీకరిస్తాను. ముఖ్యంగా, నా దృష్టి యువత భవిష్యత్తుపై, మహిళా సాధికారతపై ఉంటుంది.దయచేసి మార్పును కోరుకోండి, మీ విలువైన ఓటును నాపై నమ్మకంతో వేయండి. మీరు ఇచ్చే ఒక్క అవకాశం మన వార్డు భవిష్యత్తును నిర్ణయిస్తుంది."



## గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా మునుగాల స్వప్న మహిపాల్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 05చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామ బీజేపీ సర్పంచ్ అభ్యర్థి మునుగాల స్వప్న మహిపాల్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ కార్యకర్తలు,నాయకులు ,గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి మునుగాల స్వప్న మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, సంక్షేమం కోసమే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని , ప్రజలు తమ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. అనేక రకాల సమస్యలను పరిష్కరించే దిశగా పరిపాలన సాగిస్తూ అన్ని వర్గాల కోసం పని చేస్తానని తెలిపారు.యువత, మహిళలు, వృద్ధుల కోసం ప్రణాళిక ప్రకారం పని చేస్తానని తెలిపారు.




## రాంరెడ్డిపల్లి సర్పంచ్ ను సన్మానించిన డీకే అరుణ

కల్వకుర్తి ఊర్కొండ డిసెంబర్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందున శుక్రవారం పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణని బీజేపీ రాష్ట్ర నాయకులు ముచర్ల జనార్ధన్ రెడ్డికి ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డికి సమక్షంలో రాంరెడ్డి పల్లి సర్పంచ్ ఓర్సు అలివేలు ఆంజనేయులు ఉప సర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎంపీ వారిని శాలువతో ఘనంగా సత్కరించారు.రాంరెడ్డి పల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపాలని మీకు ఎల్లప్పుడూ నా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.



## బిజెపి మద్దతుతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అంతటి భాగ్యలక్ష్మి సర్పంచిగా నామినేషన్

### నామినేషన్ కు హాజరైన బిజెపి- బిఆర్ఎస్ నాయకులు


యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం గ్రామ సర్పంచ్ గా బిజెపి పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అంతటి భాగ్యలక్ష్మి నామినేషన్ వేశారు, ఈ నామినేషన్ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి, రాచకొండ రవీంద్ర చారి, కొండ గిరి గౌడ్, బిజెపి నాయకులు బద్దం యాదయ్య గౌడ్, వంగరి రఘుపతి, ఊష్కాగుల గిరి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సిలువేరు బిక్షం, తెలంగాణ బిక్షం, నీళ్ల లింగస్వామి గౌడ్, రాచకొండ గిరిబాబు, బొమ్మ గోలి రమేష్, పాలకూర సతీష్ గౌడ్, మాజీ సర్పంచ్ ఏర్పుల అంజమ్మ, బిఆర్ఎస్ మహిళా నాయకురాలు, బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు

## షావోమీ ఇండియా నుంచి రెడ్మీ 15సీ 5జీ ఆవిష్కరణ



గచ్చిబౌలి వార్త మిర్రర్ : షావోమీ ఇండియా సొగసైన డిజైన్, ఇమ్మర్సివ్ డిస్ప్లే, నమ్మదగిన పనితీరుతో కొత్త రెడ్మీ 15సీ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను గచ్చిబౌలి లోని లే మెరిడియన్ హెూటల్ లో శుక్రవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు సందీప్ శర్మ, అభిలాష్ మాట్లాడుతూ 17.53 సెం.మీ. హెచ్‌డీం ఇమ్మర్సివ్ డిస్ప్లే, 120హెర్ట్జ్ అడాప్టివ్ సింక్, 50ఎంపీ ఏఐ డ్యూయల్ కెమెరా, శక్తివంతమైన 6000ఎంఏహెచ్ బ్యాటరీ, 33డబ్ల్యూ టర్బో ఛార్జింగ్, 10డబ్ల్యూ రివర్స్ ఛార్జింగ్ వంటి ఫీచర్లతో ఇది రోజువారీ పనులకు అనువుగా రూపొందించబడింది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్, 16జీబీ వరకు ర్యామ్ (మెమరీ ఎక్స్‌టెన్షన్‌తో), 1టిబి వరకు విస్తరించుకునే స్టోరేజ్, షావోమీ హైపర్ ఓఎస్2, గూగుల్ సర్కిల్ టు సెర్చ్, గూగుల్ జెమినీ, కాల్ సింక్, షేర్డ్ క్లిప్‌బోర్డ్ వంటి స్మార్ట్ ఫీచర్లు ఇందులో లభ్యమవుతాయి. 3డి క్వాడ్ కర్వ్డ్ బ్యాక్, ఫ్లోటింగ్ క్రేటర్ కెమెరా డిజైన్‌తో ఇది మూన్‌లైట్ బ్లూ, డస్క్ పర్పుల్, మిడ్‌నైట్ బ్లాక్ రంగుల్లో అందుబాటులోకి వచ్చింది. ఐపీ64 రేటింగ్, 200% వాల్యూమ్ బూస్ట్ వంటి మన్నిక, ఆడియో ప్రయోజనాలు కూడా కలవు. 4జీబీం128జీబీ మోడల్ ధర ?12,499, 6జీబీం128జీబీ ధర ?13,999, 8జీబీం128జీబీ ధర ?15,499గా నిర్ణయించారు.



## నన్ను ఆశీర్వదించి గెలిపించండి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా కరిమికొండ అశోక్ స్వప్న

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 5,

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ ప్రజలు నన్ను ఆశీర్వదించి గెలిపించండి, అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో నేను చూపిస్తాను అని సర్పంచ్ అభ్యర్థి కరమికొండ అశోక్ స్వప్న అన్నారు. ప్రస్తుతం మన గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ చాలా ఇబ్బందికరంగా ఉన్నది, నేను గెలిచిన తర్వాత మన గ్రామంలో మొత్తం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకువచ్చి రోడ్డుపై చుక్క నీరు ప్రవహించకుండా చూసే బాధ్యత నాది మరియు స్కూళ్లలో విద్యార్థినీ, విద్యార్థులకు టాయిలెట్స్, వాటర్ సమస్యలు లేకుండా చూస్తాను, మన గ్రామంలో మహిళా సంఘాలు అధికంగా ఉన్నందున ప్రత్యేకంగా మహిళల కోసం ఒక భవనాన్ని నిర్మిస్తాను. గ్రామంలో అవసరం ఉన్నచోట సిసి రోడ్లు వేయిస్తాను మరియు గ్రామంలో యువతకు ఉపాధి కల్పించే దిశగా ముందడుగు వేస్తాను అని ఆమె అన్నారు..



## భారీ ర్యాలీ నడుమ సీపీఐ అభ్యర్థి రంగారెడ్డి నామినేషన్

దేవరకొండ డిసెంబర్ 05 వార్త మిర్రర్

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడమటి పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా పల్లా రంగారెడ్డి, ఆయనతో పాటు వార్డు సభ్యుల గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం నామినేషన్ సందర్భంగా భారీగా తరలివచ్చిన సిపిఐ, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలతో కలిసి గ్రామంలో అమరుల వీరుల స్తూపానికి నివాళులు అర్పించారు. అనంతరం నామినేషన్ ధాకలుకు భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ ధాకలు చేశారు.ఈ నామినేషన్ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వల్లమల్ల ఆంజనేయులు,కిన్నెర యాదయ్య,కాటం గోవర్ధన్,కాంగ్రెస్ నాయకులు ముత్తని రవీందర్ రెడ్డి, పల్లా భూపతి రెడ్డి, దాసరి వెంకటయ్య,పల్లె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆశీస్సులతో సిపిఐ మద్దతుతో సర్పంచ్ గా నామినేషన్ వేసిన ఉప్పల విజయలక్ష్మి - లింగస్వామి

**అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి డప్పుల వాయిద్యాలతో నామినేషన్ కు బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు**

**తరలివచ్చిన సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు, గ్రామ మహిళలు, యువజన సంఘాల నాయకులు**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉప్పల విజయలక్ష్మి – లింగస్వామి నామినేషన్ వేశారు, ఈ నామినేషన్ కు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి డప్పుల వాయిద్యాలతో విగ్రహం నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరిన సిపిఐ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బచ్చన గొని గాలయ్య, గౌస్ మొద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి, యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందుకుల బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్త ప్రేమ చందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి, ఉప్పల లింగస్వామి, మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, ఉప్పల కృష్ణ, అజహార్, ఇరు పార్టీల శ్రేణులు, గ్రామ మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు,

## భారతీయ ప్రాచీన వైద్య విధానాలకు పూర్వవైభవం తధ్యం...

**ఆలే శ్యామ్ కుమార్...**

**అందుబాటులోకి హెూమియో, న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపీలు....**



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : భారత్ లో ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. కొండాపూర్ రాజరాజేశ్వర నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుఃవృద్ధి హెూమియోపతిక్ అండ్ వెల్‌నెస్ క్లీనిక్ ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయుఃవృద్ధి వ్యవస్థాపకురాలు డాక్టర్ సింధు బైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ట రామ్, సలహాదారులు చింతకింది గోవర్ధన్ గౌడ్ లను ఆలె శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి ప్రాంత వాసులకు అధునాతన హెూమియోపతి సేవలతో పాటు న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకురావడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడ్డప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హెూమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యంను ఎంచుకోవాలని సూచించారు. భారతీయ జీవన విధానంలో ప్రాచీన వైద్య విధానాలు ఎన్నో అందుబాటులో ఉండేవని అందులో విశిష్టమైనది మ్యూజిక్ థెరపీ అని అన్నారు. రాగాలను ఉపయోగించి రోగాలను నయం చేసే ప్రాచీన పద్ధతి కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఇటీవల మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకోవడం గొప్ప విషయమని అన్నారు. కరోనా తర్వాత మన ప్రాచీన సాంప్రదాయ వైద్య విధానానికి తిరిగి ఆదరణ లభిస్తుండడం, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం మనకెంతో గర్వకారణమని అన్నారు. వెల్‌నెస్ సెంటర్ లోని వివిధ విభాగాలను అతిథులుగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, %ాదీ×% రిటైర్డ్ %ూ+వీ% బాల్ద అశోక్, యోగా శిక్షకులు, సీనియర్ జర్నలిస్ట్ పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేంద్రరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు హెూమియో వైద్య ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసి చూపిస్తా ఆశీర్వదించండి

**- ఎస్ లింగోటం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భీమిడి ప్రదీప్ జీ**



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 05చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చెయకుండా గ్రామంలో బాధ్యతయుతమైన పాలన అందిస్తానని, గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని స్వాములవారి లింగోటం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భీమిడి ప్రదీప్ జీ అన్నారు. శుక్రవారం స్వాములవారి లింగోటం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా భీమిడి ప్రదీప్ జీ నామినేషన్ వేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరిట గ్రామ పంచాయతీలను అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిందని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పని చేస్తుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని, అలాంటి గ్రామాలలో ఆశతో ఉన్నవారికి అధికారం ఇస్తే దోచుకుంటారు. ఆలోచనతో ఉన్న వారికి అధికారం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారని అన్నారు. గ్రామాభివృద్ధి కి ఎస్ లింగోటం గ్రామ ప్రజలు ఆశీర్వదించి సర్పంచ్ గా గెలిపిస్తే అన్ని రంగాల్లో ముందుండి మీ సమస్యలే నా సమస్యలుగా భావించి నిరంతరం ప్రజాసేవ కొరకు కృషి చేస్తానని అన్నారు. అధికారం ఉన్న లేకున్నా గ్రామంలోని పేద ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకున్నానని, పేద ప్రజల పిల్లల విద్యకు తన సొంత ఖర్చులతో సహకరించానని తెలిపారు. ప్రజలు నాపై విశ్వాసంతో నన్ను ఆశీర్వదిస్తే గ్రామంలోని అన్ని రంగాల వర్గాల వారికి అనుకూలంగా సేవలందిస్తానని కుల మత జాతి విభేదాలు లేకుండా పనిచేస్తానని,అందరిని సమాన దృక్పథంతో ప్రతి ఒక్కరిని ఆత్మగౌరవంతో సమాజ సేవ చేయడానికి ముందుకు వచ్చను మీరందరూ పెద్ద మనసు చేసుకొని సర్పంచ్ గా గెలిపిస్తే అనేక అభివృద్ధి పనులు చేయిస్తాను, రాజకీయంగా, ఆర్థికంగా,సమాజ సేవకు ముందుండి సేవ చేయడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిస్వార్థ రాజకీయాలకు తావు లేకుండా నిస్వార్థమైన సేవలను అందించడంలో ముందు ఉంటానని, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని గ్రామస్తులను కోరారు. అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## అభివృద్ధి చేసి చూపిస్తా ఆశీర్వదించండి

**బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుండెబోయిన శిరీష ఇస్తారి యాదవ్**





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 05

చౌటుప్పల్ మండలం పెద్దకొండూర్ గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చెయకుండా గ్రామంలో బాధ్యతయుతమైన పాలన అందిస్తానని, గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని పెద్ద కొండూరు టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుండెబోయిన శిరీష ఇస్తారి యాదవ్ అన్నారు.శుక్రవారం పెద్దకొండూర్ బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గా గుండెబోయిన శిరీష ఇస్తారి యాదవ్ నామినేషన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరిట నూతన గ్రామ పంచాయతీలను శాస్త్రీయంగా ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజా సంక్షేమం కోసమే బి ఆర్ ఎస్ పని చేస్తుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని, అలాంటి గ్రామాలలో ఆశతో ఉన్నవారికి అధికారం ఇస్తే దోచుకుంటారు. ఆలోచనతో ఉన్న వారికి అధికారం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారని అన్నారు.గ్రామాభివృద్ధి కి పెద్దకొండూర్ గ్రామ ప్రజలు ఆశీర్వదించి సర్పంచ్ గా గెలిపిస్తే అన్ని రంగాల్లో ముందుండి మీ సమస్యలే నా సమస్యలుగా భావించి నిరంతరం ప్రజాసేవ కొరకు కృషి చేస్తానని అన్నారు. అధికారం ఉన్న లేకున్నా గ్రామంలోని పేద ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకున్నానని, పేద ప్రజల పిల్లల విద్యకు తన సొంత ఖర్చులతో సహకరించానని తెలిపారు. ప్రజలు నాపై విశ్వాసంతో నన్ను ఆశీర్వదిస్తే గ్రామంలోని అన్ని రంగాల వర్గాల వారికి అనుకూలంగా సేవలందిస్తానని కుల మత జాతి విభేదాలు లేకుండా పనిచేస్తానని, అందరిని సమాన దృక్పథంతో ప్రతి ఒక్కరిని ఆత్మగౌరవంతో సమాజ సేవ చేయడానికి ముందుకు వచ్చను మీరందరూ పెద్ద మనసు చేసుకొని సర్పంచ్ గా గెలిపిస్తే అనేక అభివృద్ధి పనులు చేయిస్తాను, రాజకీయంగా, ఆర్థికంగా,సమాజ సేవకు ముందుండి సేవ చేయడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిస్వార్థ రాజకీయాలకు తావు లేకుండా నిస్వార్థమైన సేవలను అందించడంలో ముందు ఉంటానని, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని గ్రామస్తులను కోరారు. అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సి పిఎం, పార్టీ నాయకులు బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్జీఐ ఎయిర్ పోర్ట్ లో పరిస్థితులను సమీక్షించిన సైబరాబాద్ పోలీసులు.....



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఇండిగో విమానాల రద్దు, అంతరాయులపై ప్రయాణికులలో నెలకొన్న ఆందోళన నేపథ్యంలో శంషాబాద్ డీసీపీ బి.రాజేష్, అదనపు డీసీపీ కె.పూర్ణచందర్ రావు, ఏసీపీ వి.శ్రీకాంత్ గౌడ్, ఆర్జీఐఏ ఔట్‌పోస్ట్ ఇన్‌స్పెక్టర్ సంపతి కనకయ్య శుక్రవారం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించారు.ఇండిగో విమానాల రద్దు, విమాన కార్యకలాపాల్లో వచ్చిన అంతరాయాలపై అధికారులు ఇండిగో రీజినల్ మేనేజర్‌తో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. సమస్యను అత్యవసర ప్రాధాన్యతతో పరిష్కరించే లా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే సాధారణ సేవలు పునరుద్ధరించనున్నామని రీజినల్ మేనేజర్ డీసీపీకి వివరించారు.అనంతరం డిసిపి సిబ్బందితో కలిసి ఇండిగో చెకిన్ కౌంటర్లు, డిపార్చర్ జోన్, బోర్డింగ్ గేట్లు, బస్ గేట్లను పరిశీలించారు. ప్రయాణికుల రాకపోకలు, సిబ్బంది నియామకాలను సమీక్షించి ప్రస్తుత పరిస్థితి పై ఆరా తీశారు.ప్రయాణికుల సౌకర్యం దృష్ట్యా, పీక్ అవర్స్‌లో, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్జిఐఏ అవుట్ పోస్ట్ ఇన్ స్పెక్టర్ సంపతి కనకయ్య ను ఆదేశించారు.సమస్య పరిష్కారమయ్యే వరకూ ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని డిసిపి తెలిపారు.